చంద్రబాబుతో కోటంరెడ్డి సోదరులు భేటీ

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు:టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తదితరులు గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉండవల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యి చంద్రబాబుకు పుష్ప గుచ్చాన్ని అందజేశారు. నెల్లూరు రూరల్ లో మంచి మెజార్టీతో గెలుపొందినందుకు చంద్రబాబు కోటంరెడ్డి సోదరులను అభినందించారు.

విశాలాంధ్ర



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

శుక్రవారం 07, జూన్ - 2024 4 పేజీలు

చంద్రబాబు నాయుడు,లోకేష్‌ను కలిసిన వేమిరెడ్డి దంపతులు

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడుని, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం అమరావతికి చేరుకున్న వారు.. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడుని ప్రత్యేకంగా కలిశారు. నెల్లూరు జిల్లాలో ఎంపీగా, ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందిన వేమిరెడ్డి దంపతులను చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ప్రత్యేకంగా అభినందించారు. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌ను కలిసిన వారిలో నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో విజయవంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి

అధికారులు, సిబ్బంది,ప్రజలకు రాజకీయపార్టీల ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు

జిల్లాలో ముగిసిన ఎన్నికల కోడ్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు :2024 సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో తుది ఘట్టమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగియడంతో గురువారం సాయంత్రం జిల్లాలో ఎన్నికల కోడ్ ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. హరినారాయణన్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన రిటర్నింగ్ అధికారులకు, ప్రజలు, అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు మార్చి 16న జిల్లాలో అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్ గురువారం ముగిసిందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో సుదీర్ఘంగా 82 రోజుల పాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. నెల్లూరు నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లో జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వివిధ బృందాలను నియమించి ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పర్యవేక్షించినట్లు కలెక్టర్ చెప్పారు. మే 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా పూర్తికాగా, జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ కూడా విజయవంతంగా పూర్తయినట్లు కలెక్టర్ చెప్పారు. ఎక్కడా కూడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా, శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసి శాంతి భద్రతలు కాపాడిన పోలీస్ శాఖకు, ప్రింట్,ఎలెక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి కౌంటింగ్ ముగిసే వరకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సిబ్బందికి శిక్షణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటరుజాబితా తయారీ, ఓటరు స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, ఓటు ఆవశ్యకత, వినియోగంపై అవగాహన కార్యక్రమాలు, వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్ద ఓటు వినియోగం, పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల వినియోగం మొదలుకొని అన్ని ఎన్నికల ప్రక్రియలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా పక్కా కార్యాచరణతో జిల్లా యంత్రాంగం పూర్తి చేసినట్లు చెప్పారు. అధికారులు, సిబ్బంది, ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో 2024 సార్వత్రిక ఎన్నికల ప్రకియను విజయవంతంగా పూర్తి చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో పెద్దఎత్తున ఓట్లు వేసి ఎన్నికల పర్వం- దేశానికి గర్వం అనే నినాదాన్ని నిజం చేస్తూ ప్రజాస్వామ్య గౌరవాన్ని ఇనుమడింపజేసిన జిల్లా ప్రజానీకానికి కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు, జిల్లా యంత్రాంగం, రాజకీయ పార్టీల ప్రతినిధులు అందించిన సహకారానికి కలెక్టర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

క్యాంపస్ ప్లేస్ మెంట్స్‌లో 105 మంది ఎంపిక

విశాలాంధ్ర - కావలి : పట్టణంలోని ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల లో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్ మెంట్స్ లో 105 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. 60 మంది విద్యార్థులు రైనెక్స్ కంపెనీ కి ఎంపిక కాగా, 45 మంది ఆల్ ట్రూయిస్ట్ కంపెనీకి ఎంపికయ్యారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఎంపికల్లో ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో పాటు, వివిధ డిగ్రీ కాలేజీల విద్యార్థులు, ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా ఎంపికైనారు. గురువారం ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి మాట్లాడుతూ రైనెక్స్ కంపెనీ లో ఉద్యోగం పొందిన వారికి వార్షిక వేతనం రూ. 5.2 లక్షలుగా ఉంటుందని, ఆల్ ట్రూయిస్ట్ కంపెనీ కి ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ. 2.2 లక్షలుగా ఉంటుందని తెలిపారు. ప్రతి సంవత్సరం మా కాలేజీలోని విద్యార్థుల కోసం క్యాంపస్ ప్లేస్ మెంట్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మా కాలేజీలో నిర్వహిస్తున్న క్యాంపస్ ప్లేస్ మెంట్స్ ద్వారా ఇతర కాలేజీ విద్యార్థులకు కూడా ఉద్యోగాలు కల్పిస్తున్నామని తెలిపారు.. చదువుతో పాటు ఉద్యోగం కల్పించడమే లక్ష్యంగా కళాశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

పాలపిట్ట దీర్ఘ కావ్య రచయిత ముప్పవరపు కిషోర్ ఉద్ఘాటన

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : అక్షర రూపం దాల్చిన ఒక్క సిరా చుక్క లక్ష మెదడులని కదిలిస్తుందని పాలపిట్ట రచయిత ముప్పవరపు కిషోర్ అన్నారు స్వాతంత్ర్య పోరాటంలో గ్రంథాలయ ఉద్యమం విద్యార్థులను యువతను మేధావులను సమీకరించింది, సాహిత్యము, శాస్త్ర సాంకేతిక విజ్ఞానము గ్రంథాలయం అందించి విజ్ఞాన కేంద్రముగా విరాజిల్లుతుందని పాలపిట్ట దీర్ఘ కావ్య రచయిత ముప్పవరపు. కిషోర్ అన్నారు స్థానిక శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో పౌర శాఖ గ్రంథాలయం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాలపిట్ట రచయిత ముప్పవరపు కిషోర్ పాల్గొని మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణ శిబిరంలో పాలపిట్ట పుస్తకం పరిచయం

200 ఎకరాలలో పండ్ల తోటలు పెంపకం లక్ష్యం

విశాలాంధ్ర-ఉదయగిరి : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనుల్లో భాగంగా మండలంలో 200 ఎకరాలలో పండ్ల తోటలు పెంచడం లక్ష్యమని ఏపీవో శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలోని స్త్రీ శక్తి భవనములో మండల ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు ప్రతి ఒక్కరికి కచ్చితంగా పనులు కల్పించాలన్నారు. పండ్ల తోటల పెంపకానికి సంబంధించి రైతులు తమ వివరాలను తెలిపితే ప్రతిపాదన పంపిస్తామన్నారు

నారా లోకేష్‌ను కలిసిన కాకర్ల సురేష్

విశాలాంధ్ర-ఉదయగిరి : స్థానిక నియోజకవర్గం నుంచి అద్భుత విజయం సాధించిన శాసనసభ్యులు కాకర్ల సురేష్, కాకర్ల ప్రవీణ దంపతులు ఉండవల్లిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గారిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ గారికి పుష్పగుచ్చం అందజేసి శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ కాకర్ల సురేష్ ను అలింగనం చేసుకుని శభాష్ సురేష్ రికార్డు సృష్టించావని అభినందించారు. ఉదయగిరి అభివృద్ధికి సంబంధించి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజాక్షేత్రంలో ప్రజలకు సేవలు అందించి సేవకుడిగా నిలిచి, ఉదయగిరి అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. ముందుగా కాకర్ల దంపతులు కనకదుర్గ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సంబరాలు చేసుకున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

(మొదటి పేజీ తరువాయి)

చేయటం విద్యార్థులకు అందించటం ఆనందకరమైన విషయం అని అన్నారు లైబ్రరీలో సాహిత్య సాంస్కృతిక చరిత్ర శాస్త్ర శాస్త్రీయ విజ్ఞాన పుస్తకాలు లభ్యమవుతాయని ప్రతి ఒక్కరు పుస్తకాలు చదివి గతాన్ని వర్తమానాన్ని భవిష్యత్తునుసమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గ్రంథ పాలకురాలు నాగరజని మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడిందని వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయుటకు వకృత పోటీలు వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు, పుస్తక పరిచయ సభలు నిర్వహించడం జరిగినది విద్యార్థులందరికీ బహుమతులతో పాటు పుస్తకాలను కూడా బహుకరించడం జరిగినది అని అన్నారు.దమ్మ చక్ర ఫౌండేషన్ అధ్యక్షులు ఉపాసకులు గాండ్ల హరిప్రసాద్ మాట్లాడుతూ శాస్త్రీయ అధ్యయనం చేయటానికి గ్రంథాలయాలను దేవాలయాలుగా భావించి విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. అమ్మ ఫౌండేషన్ వెల్ఫేర్ అధ్యక్షులు బివి రమణ మాట్లాడుతూ విద్యార్థులు కాంపిటేటివ్ పరీక్షలకు పోటీ పడటానికి గ్రంథాలయాలను నిరుద్యోగ యువత విరివిగా ఉపయోగించుకోవాలని కోరారు. శ్రీవారి సేవా సమితి అధ్యక్షులు ఏవిఆర్ మూర్తి మాట్లాడుతూ పుస్తకాలు అధ్యయనం చేయడం ద్వారా మానవ జీవితంలో వ్యక్తిత్వ వికాసం పొందిన వారు అనేకమంది ఉన్నారని వారిని ఆదర్శంగా తీసుకొని పుస్తకాలు చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలోగ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చిల్లర సుబ్బారావు,పగడాల రోశయ్య, ఎస్కే ఖాదర్ భాష, జి శ్రీనివాసులు, సిహెచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర-ఉదయగిరి : ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల కన్నా మిన్నగా విద్యాబోధన అందుతుందని ప్రభుత్వం ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గురువారం మండల పరిధిలోని జి. చెర్లోపల్లి, వడ్డేపాలెం గ్రామాల్లో బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యా యులు ఇంటింటా ప్రభుత్వ పాఠశాలల బోధనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదవ తరగతి పూర్తయిన విద్యార్థుల ఇంటికి వెళ్లి ఆరవ తరగతికి తమ పాఠశాలలో చేరాలని తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో అందే విద్యపై అవగాహన కల్పించామన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతోపాటు డిజిటల్ క్లాసుల ద్వారా విద్యార్థులకు పాఠాలను బోధిస్తామని ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ఉపయోగించుకొని ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లల్ని చేర్చాలని ఇంటింటా పర్యటన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాయబ్ సుబ్బారెడ్డి ఫణి తదితర ఉపాధ్యాయులు స్థానికులు పాల్గొన్నారు.

దుర్గంధం వెదజల్లుతున్న ట్యాంక్ బండ్

విశాలాంధ్ర-ఉదయగిరి : పట్టణ సమీపంలోని ట్యాంక్ బండ్ దుర్గంధం వెదజల్లుతూ రాకపోకలు సాగిస్తున్న వారికి తీవ్ర అసౌకర్యం కలిగిస్తుంది రోజు వందల సంఖ్యలో వాహనాలతో పాటు ఆటోలు ద్విచక్ర వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా ఉదయం సాయంత్రము ఈ ట్యాంకు బండి పై పెద్దలు మహిళలు యువకులు పెద్ద సంఖ్యలో వాకింగ్ చేస్తుంటారు సాయంత్రం వేళ చాలామంది ట్యాంక్ బండ్ పై సేద తీరుతుంటారు. బస్టాండుకు సమీపంలో ఉండటంతో హాస్పటల్ హెూటల్స్ ఖాళీ కొబ్బరి బోండాలు మంగళ షాపు వ్యర్థాల చికెన్ మటన్ చేపల షాపుల అర్థాలు ట్యాంక్ బండ్ లో వేస్తుండడంతో భరించరాని దుర్గంధం వెదజల్లుతోంది. ముళ్ళ వదలు చెట్లతో నిండిపోవడంతో సమీపాన ఉన్న బాలాజీ నగర్ ఇండ్లలో సర్పాలు దర్శనమిస్తున్నాయని ఆ ప్రాంతవాసులు రాబోతున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారు లు స్పందించి ట్యాంక్ బండ్ లో వ్యర్థాలు వేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

14వ డివిజన్లో తెలుగుదేశం విజయోత్సవం-ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : తెలుగుదేశం పార్టీఘన విజయం సాధించిన సందర్భంగా14వడివిజన్ ఉపాధ్యక్షుడు ద్రోణాదుల యలమందారెడ్డి ఆధ్వర్యంలో వికాస్ స్కూల్ వీధి సెంటర్లో పెద్ద ఎత్తున బాణసంచాకాల్చి విజయోత్సవ సంబరాలుచేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీఅరాచక ప్రభుత్వాన్నిఆంధ్ర రాష్ట్ర ప్రజలు బంగాళాఖాతంలో కలిపేసారని అన్నారు. పోలింగ్సరళిలోనే ప్రజాతీర్పు స్పష్టమయి పోయిందన్నారు. ఈరాష్ట్రానికి జగనాసురపీడ విరగడ యిందని సంతోషం వ్యక్తం చేశారు. అభివృద్ధి ప్రదాత అయిననారాయణని నెల్లూరు చరిత్రలో లేనివిధంగా అత్యధిక మెజారిటీతో గెలిపించిన నెల్లూరు సిటీ నియోజకవర్గ ప్రజలకు ఉచ్చి ప్రత్యేక ధన్యవాదాలు తెలియ చేశారు.

ఈ సంబరాల్లో డివిజన్ ప్రధాన కార్యదర్శి సుభాన్ బాషా, బూత్ కన్వీనర్లు, బి ఎల్ ఏ లు, విశ్రాంత ఉద్యోగులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు చేసుకున్నారు.

సోమిరెడ్డిని కలిసిన మండల టిడిపి నేతలు

విశాలాంధ్ర - మనుబోలు : మండల టిడిపి నేతలు గురువారం సోమిరెడ్డిని కలిసి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మండలాభివృద్ధికి పలు విషయాలను చర్చించారు. అదేవిధంగా ప్రతి నాయకుడు కార్యకర్త అభిమానికి అండగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గాలి రామకృష్ణారెడ్డి, మాజీ కనుపూరు కెనాల్ ప్రాజెక్ట్ చైర్మన్ మస్తాన్ నాయుడు, టిడిపి జిల్లా నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య తదితరులు ఉన్నారు.

మహారాజశ్రీ గూడూరు 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

ఓఎస్ నెం:19/2019

రాచపూటి గురుప్రసాద్ - వాది

ఎదిరి

1. రామిశెట్టి నాగభూషణమ్మ మరియు వగైరాలు - ప్రతివాదులు

నోటీసు

టు,

3వ ప్రతివాది: మెట్ట. సతీష్‌కుమార్ రెడ్డి, తండ్రి లేట్ శివకుమార్ రెడ్డి, రెసిడెన్స్ ఆఫ్ డి.నెం: 25-1-1404, న్యూ స్టేట్ బ్యాంకు కాలనీ, నేతాజీ నగర్, నెల్లూరు సిటీ , ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా.

15వ ప్రతివాది: షేక్. అమ్ములు, భర్త కరిముల్లా, రెసిడెన్స్ ఆఫ్ నేదురుమల్లి గ్రామం & పోస్టు, పొదలకూరు మండలం, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా.

ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా పై నెంబరు కేసునందు గౌరవనీయులైన 7వ అదనపు జిల్లా జడ్జి కోర్టు వారు మీకు నోటీసును తేదీ 21-06-2024న వాయిదా వేసియున్నది. కావున ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల పై తెలిపిన కోర్టు నందు 21-06-2024వ తేదీ ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ, హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల ఎటువంటి అభ్యంతరములు లేనట్లుగా భావించి మీ పరోక్షమున తీర్మాంచబడును.

పిడూరు. నాగేశ్వరరావు, ఎస్.కె.నాగూరు
వాది తరపు న్యాయవాదులు, గూడూరు,
సెల్ : 6281449260, 9291507471

తెలుగుదేశం పార్టీ విజయదుందభి విజయంతో రాపూరులో సంబరాలలో నాయకులు కార్యకర్తలు

విశాలాంధ్ర - రాపూరు : తెలుగు దేశం పార్టీ సునామి ప్రభంజనంలో విజ య దుందుభి మోగించడం తో వేంక టగిరి నియేజక వర్గ ఎంఎల్ఏ కురు గొండ్ల రామకృష్ణా విజయకేతనం సందర్భంగా రాపూరు లో 66 వ బూత్ కన్వీనర్ లతీఫ్ అద్వార్యానబుధవా రం రాత్రి 7 గంటలకు కోత్తపేటలోని శ్రీనివాస మహల్ వద్ద మండల టిడి పి అధ్య క్షులు దందొలు వేంకటేశ్వర రెడ్డి, పటణ అధ్యక్షులు ఏదోటి కోటీ శ్వర నాయుడు,మండల కో అప్షన్ సభ్యులు సయ్యద్ సయిాద్, రాపూ రు మండల మహిళా అధ్యక్షురాలు చిల్లువురు రమణమ్మ,షాదిమంజిర్ మాజీ చెర్మన్ సయ్యద్ ఆరీఫ్,చాన్ బాషా(స్వీట్స్) సయ్యద్ షపి,ఎస్ సి సెల్ కార్యదర్శి చింతగుంట రాజా, నాయకులు గౌస్ బాషా,ఖాదర్ బాషా,రబ్బాని,యువత అలీమ్,గౌస్, జమీర్, బాసిద్, అంజత్, నజీర్, అమ్మరుల్లా, స్థానిక నాయకులు కార్యకర్తల సమక్షంలో కెక్ ను కట్ చేసి ఒకరికోక రు నోరు తీపిచెసుకోని,జై చంద్రబా బు,జై లోకేష్,జై కురుగొండ్ల రామకృ ష్ణ జిందాబాద్ అంటు యువత కెరిం తలతో సంబరాలు అంబరాన్ని అంటాయి.

ప్రకటన

నా తాలూకు ముత్యాలపాడు గ్రామము, చిల్లకూరు మండలము నందు గల సర్వే నెం. 438/పార్ట్ భూములకు సంబంధించిన ఓరిజినల్ శెటిల్‌మెంట్ పత్రము తే. 26.09.1970 దిన అల్లారెడ్డి శ్యామసుందరరెడ్డి గారు అల్లారెడ్డి సురేఖమ్మ, తండ్రి అల్లారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి గారి పేరిటకి వ్రాసి గూడూరు ఎస్.ఆర్.ఓ. నందు డాక్యుమెంట్ నెం.1435/1971గా రిజిష్టరు కాబడిన పత్రము యొక్క ఒరిజినల్‌ను నేను తే. 01.06.2024 దిన నా వద్ద భూమిని కొనుగోలు చేసిన వారికి సదరు ఒరిజినల్ పత్రమును స్వాధీనము చేయుటకు గాను నెల్లూరు నవాబుపేట మెయిన్ రోడ్డు నందు గల జెరాక్సు షాపుకు పోవుచుండగా దారిలో పోయినది. కావున ఎవరికైననూ దొరికిన యెడల ఈ దిగువ అడ్రసుకు తెచ్చి యివ్వవలసినది. వారికి తగు బహుమానము ఇవ్వబడును.

అల్లారెడ్డి హేమవెంకటపవన్ సిద్దు
చెన్నై.
8897944555

వైకాపాను దెబ్బతీసిన ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓట్లు

- పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో తెదేపాకు 9,641 మెజారిటీ

విశాలాంధ్ర - కొండాపురం : ఉద్యోగులు ఉపాధ్యాయులు ఐదేళ్ల వైకాపా పాలనపై తమ తిరుగుబాటును ఓటు రూపంలో వ్యక్తం చేశారు. వైకాపా ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఉద్యోగులకు నెలనెలా జీతాలను సకాలంలో ఇవ్వడంలో అలసత్వం చూపారు. ప్రభుత్వం నుంచి రావలసిన డిఎ, సరెండర్ లీవ్, పిఆర్సి తదితర బకాయిలు రూ. వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయి. ఇందు కొరకు పలుమార్లు ఉద్యమాలు చేసినా సంఘాల నాయకులను బెదిరించి ఉద్యమాలను అణిచివేశారు. వైకాపా పాలనపై ఉన్న కసిని ఉద్యోగులు ఓటు రూపంలో తీర్చుకొన్నారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో 24,243 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ కాగా టిడిపికి 16,792 ఓట్లు, వైసీపీకి 7,151 ఓట్లు లభించాయి. అంటే తెదేపాకు 69.3 శాతం ఓట్లు లభించాయి. వైకాపాకు 29.5 శాతం ఓట్లు మాత్రమే లభించాయి. మొత్తం మీద పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో తెదేపాకు 9,641 ఓట్లు ఆధిక్యం లభించింది.

టిడిపి ఆధిక్యతను జీర్ణించుకోలేక దాడి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: నెల్లూరు రూరల్ 34వ డివిజన్లో టిడిపిఆధిక్యతను జీర్ణించుకోలేకదాడిజరిగినట్లు టిడిపి కార్యకర్తలుఆరోపిస్తున్నారు. ఈడివిజన్లో టిడిపికి ఆధిక్యత రావడంతో పాటు, డివిజన్‌లో స్థానికంగా వాలంటీర్లు వైసిపికి అనుకూలంగా వ్యవహరించారు. దీనిపై వివాదం తలెత్తింది. టిడిపి డివిజన్ ఇంచార్జ్ మస్తాన్ వైసిపి డివిజన్ ఇంచార్జ్ రియాజ్ మధ్య జరిగిన వివాదంలో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు కత్తిపోట్లకు గురికావడంతో ఈ ప్రాంతంలో సంచలనంగా మారింది. ఎన్నికల అనంతరం ఎక్కడ అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ వివాదం సంగతి తెలియగానేవారు 34వడివిజన్వద్దకు పోలీసులు చేరుకొని వైసిపి కార్పొరేటర్ భర్త వైసిపి నేత రియాజ్ ను అదుపులోకితీసుకొని పోలీస్ స్టేషన్ ను తరలించారు.

గ్రంథాలయాలు జ్ఞాన బండాలు

విశాలాంధ్ర - ఉలవపాడు : ఉలవపాడు శాఖా గ్రంధాలయంలో జరిగే వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులకు ముగింపు వేడుకలు జరిగాయి. 20 రోజుల పాటు జరిగిన ఈ శిక్షణా తరగతులకు రోజుకు 40 మంది విద్యార్థులకు తగ్గకుండా గ్రంధాలయ సేవలను ఉపయోగించు కున్నారు. చదువుతో పాటు విద్యార్థులకు ఆటలు కూడా ఎంతో అవసరమని పిల్లలు ఈ వేసవి శిక్షణా తరగతుల్లో ప్రతిరోజూ గ్రంధాలయంలో జరిగిన వివిధ రకాల ఆటల ద్వారా పిల్లల కోరిక తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిరోజూ జరిగిన పోటీలలో గెలుపొందిన విజేతలకు సుమారు 300 బహుమతులు సుచరిత అందించారు. ఈ కార్య క్రమం విజయవంతం కావడానికి ఇన్ని రోజులు సహకరించిన దాతలకు, ప్రతిరోజూ ఎక్కువ మంది పిల్లలను గ్రంధాలయానికి పంపిన వారి,వారి తల్లిదండ్రులకు గ్రంధపాలకుడు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ ఘాతంలో షిఫ్ట్ ఆపరేటర్‌కు గాయాలు

విశాలాంధ్ర - ఉలవపాడు : మండల పరిధిలోని కరేడు పంచాయతీ లో అలగాయపాలెం సబ్ స్టేషన్ లో షిఫ్ట్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న శరణ్య అనే ఉద్యోగి అధికారుల ఒత్తిడితో విద్యుత్ స్థంభం పై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ కొట్టడంతో హుటాహుటిన ఒంగోలు లోని కిమ్స్ కి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అయితే షిఫ్ట్ ఆపరేటర్‌గా షబ్ స్టేషన్‌లో విధులు నిర్వహించవలిసిన ఉద్యోగి చేత బలవంతంగా బయట ప్రైవేట్ పనులకు ఉపయోగించుకున్న విద్యుత్ అధికారులు కనీసం స్పందించలేదు కనీసం మానవతా దృక్పథంతో కూడా ఎలా ఉంది అని అడిగిన సందర్భం లేకపోవడంతో ఉన్నత అధికారుల తీరుపై బంధువులు మండి పడుతున్నారు. ఈ విషయమై ఉలవపాడు ఏఈ స్పందిస్తూ ఈ విషయం పై విచారణ జరిపి కారకుల పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉదయగిరిలో కాకర్లకు 50.54 శాతం ఓట్లు

విశాలాంధ్ర - కొండాపురం : అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో తెలుగుదేశం పార్టీ 45.6 శాతం ఓట్లతో135 స్థానాలను గెలుచుకుంది. ఉదయగిరి నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన కాకర్ల సురేష్ 50.54 శాతం ఓట్లను గెలుచుకోవడం విశేషం. ఉదయగిరి అసెంబ్లీ స్థానానికి పోస్టల్ ఓట్లతో కలిపి మొత్తం 2,00,892 లెక్క తేల్చారు. అందులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాకర్ల సురేష్ కు 99,727 ఈవీఎం ఓట్లు, 1810 పోస్టల్ ఓట్లు కలిపి 50.54 శాతంతో 1,01,537 ఓట్లు లభించాయి. దీంతో తెదేపా అభ్యర్థి సురేష్ 9,621 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పోటీలో నిలిచిన మిగిలిన 13 మంది అభ్యర్థులు డిపాజిట్ కోల్పోయారు.

ఎస్ఈఐఎల్ ఎనర్జీలో పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర-ముత్తుకూరు : 2015 నుండి 11 లక్షలకు పైగా మొక్కలు నాటి రికార్డు సృష్టించిన సంస్థసెయిల్ ధర్మల్ విద్యుత్ ప్రాజెక్టు అని ప్రాజెక్టు యాజమాన్యం తెలిపింది. జూన్ 6 ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా, భారతదేశంలోని అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులలో (ఐపిపి) ఒకటైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (సెయిల్) ఈరోజు మండలంలోని ముసునూరు వారి పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రాంతీయ అధికారి సిహెచ్ రాజశేఖర్, ఎస్ఈ ఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఓ అండ్ ఎం (ఆపరేషన్స్ అండ్ మెయిం టెనెన్స్) హెడ్ సునీల్ కుమార్ గుప్తా హాజరయ్యారు. కంపెనీ హెచ్ఓడీలు, ఉద్యోగులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని పెద్దఎత్తున మొక్కలు నాటారు. ఉత్తమ ప్రమాణాలను అనుసరించడం ద్వారా, వివిధ పర్యావరణ అనుకూల కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఈ ప్రాంతంలో అతి తక్కువ కార్బన్ ఉద్గారాలతో ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఆదర్శంగా నిలుస్తోందని ఏపిపిసిబి ప్రాంతీయ అధికారి సిహెచ్. రాజశేఖర్ ప్రశంసించారు. కంపెనీ సీఈవో రాఘవ్ త్రివేది మాట్లాడుతూ... ఈ కార్యక్రమం నిర్వహించడంలో బృందం చేసిన కృషిని అభినందించారు. "మేము పర్యావరణ స్థిరత్వానికి కట్టుబడి ఉన్నాము. సామూహిక మొక్కల పెంపకం ద్వారా డీకార్బనైజేషన్ కార్యకలాపాలతో సహా వివిధ సిఎస్ఆర్ కార్య క్రమాలను అమలు చేయ డం ద్వారా స్థిరమైన భవి ష్యత్తు కోసం ప్రకృతి, సమాజానికి మద్దతు నిస్తా మని ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో పర్యావరణ సుస్థిరత మరియు జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి, ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ తన కార్యకలాపాల ప్రాంతాలలో, చుట్టుపక్కల గ్రీన్‌బెల్ట్‌లను అభివృద్ధి చేసింది. కంపెనీ 2015 నుండి 11 లక్షలకు పైగా మొక్కలను నాటింది. వృక్షజాలం, జంతుజాలానికి అను కూలమైన పర్యావరణ వ్యవస్థను సృష్టించేందుకు కృషి చేస్తుంది. ఫలితంగా వలస వచ్చిన వాటితో సహా 20 కంటే ఎక్కువ విభిన్నమైన పక్షి జాతులు సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ జనరేషన్ కాంప్లెక్స్‌లోని బూడిద-చెరువులు , నీటి వనరులను క్రమం తప్పకుండా సందర్శిస్తామన్నారు.

వినాయక స్వామి ఆలయంలో టిడిపి నేతలు పూజలు

విశాలాంధ్ర- మనుబోలు: సర్వేపల్లి నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఘన విజయం సాధించడం పట్ల మనుబోలు గ్రామంలోని నేతలు గురువారం దేవాలయాల్లో పూజలు నిర్వహించి గ్రామస్తులకు లడ్డు ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు శ్రీనివాసులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి క్షేమం కోరుతూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో తమ మొక్కులు తీర్చుకొని కాలనీలో ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీని గెలిపించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ లడ్డు ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు చెల్లగిరి ప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సాని వెంకట రమణయ్య, మాజీ ఉపసర్పంచ్ దండు చంద్రశేఖర్ రెడ్డి, రావుల అంకయ్య గౌడ్,టిడిపి నాయకులు పచ్చిపాల శేఖర్ రెడ్డి, మోపూరు ధనుంజయ రెడ్డి, కోసూరు ప్రసాద్ గౌడ్, బిసి కాలనీలోని టిడిపి యువత తదితరులు పాల్గొన్నారు.

రాపూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు

ప్రిన్స్‌పాల్ హనుమంతయ్య వెల్లడి

విశాలాంధ్ర -రాపూరు : రాపూరులోని ప్రభుత్వ డిగ్రి కళాశాలలో కోత్త కోర్సులు ప్రారంబించుచున్నారని ప్రిన్స్ పాల్ డాక్టర్ వేసిపోగుల హనుమంత య్య తెలియజెప్పారు. ఈ సందర్భంగా అయన తెలియజెస్తూ 198 4 సంవత్సరంలో డిగ్రి కళాశాల ప్రారంభించి 40 సంవత్సరాలు చరిత్ర కలగిన ప్రతిష్టాత్మక కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 18 వతేదిన నోటి ఫికేషన్ విడుదల కానున్నదని, 40 సంవత్సరాలుగా బిఎ,బికాం, కోర్సులతో విద్యా అందించారన్నారు. తాజాగా జి.కామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బి. యస్సీ కంప్యూటర్ సైన్స్ వంటి రెండు జాబ్ ఓరియంటెడ్ కోర్సుల ప్రారంభానికి కళాశాలకమిషనరేట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.2024 - 25 విద్యాసంవత్సరం నుండి కళాశాలలో బి.ఏ హానర్స్ హిస్టరి - ఎకనా మిక్స్ (మైనర్). బి.కామ్ కంప్యూటర్ అప్లికేషన్స్ - ఫైనాన్షియల్ మేనేజ్ మెంట్ (మైనర్),బి.యస్సీ కంప్యూ టర్ సైన్స్ - మాథెమాటిక్స్ (మైనరీ) కోర్సులు ప్రారంభమౌతాయి. కళాశా లలో అత్యధిక విద్యార్హతలు, అనుభవం కలిగిన అధ్యాపక బృందం, ఫిజికల్ ఎడుకేషన్ విభాగంతో పాటు, ఎన్‌యస్ఎస్, సాహిత్య కల్చరల్ కార్యక్రమాలు, గ్రంథాల యం, డిజిటల్ క్లాస్ రూమ్, కంప్యూటర్ లాబ్, -ఆర్ ఓ వాటర్ ప్లాంట్, ఉచిత మధ్యాహ్న భోజన వసతి ఉండం అదనపు ఆకర్షణ. సిసి కెమరాల పర్యవేక్షణతో విద్యార్థులకు సంపూర్ణ రక్షణ వుంటుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.40 సంవత్సరాల చరిత్ర కలిగిన కళాశాలలో చదవడం విద్యార్థులకు లభించే అరుదైన అవకాశం. ఈ నెల 18న నోటిఫికేషన్ విడదీలౌతుందని తెలియజెసారు. ఆన్లైన్ రిజిస్ట్రేషన్ కళాశాలలో చేయబడును. రిజిస్ట్రేషన్ ఫీజులు విద్యార్థుల పట్ల ఔదార్యంతో మేము చెల్లిస్తామని తెలియజేసారు.

ముగిసిన గ్రంథాలయ వేసవి శిక్షణా శిబిరాలు

విశాలాంధ్ర - రాపూరు : రాపూరు గ్రంథాలయంలో ఘనంగా ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు గురువారం ముగిసింది. విద్యార్థులకు సంఘ సంస్కర్తల గూర్చి మేధావుల గూర్చి దేశ భక్తులైనటువంటి నేతాజీ సుభాష్ చంద్రబోస్ భగత్ సింగ్ చత్రపతి శివాజీ మొదలగు దేశభక్తులు వారి గూర్చి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు చిత్ర లేఖనం ఆటల పోటీలు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని జే ధనమ్మ, జీవన జాగృతి మిత్రమండలి అధ్యక్షులు డి సురేష్ కావలి, నెహ్రు యువకంద్ర అధ్యక్షులు ఎన్.శివకుమార్, గోవింద్ పరశురాం గ్రంథాలయ సహాయ కుడు కే వెంకటేశ్వర్లు విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

నూతన శాసనసభ్యులను కలిసిన ఎన్జీవో సంఘ నేతలు

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : ఎన్నికలలో విజయం సాధించి రాష్ట్రముఖ్యమంత్రిగా భాద్యతలు చేపట్టబోతున్న నారాచంద్రబాబు నాయుడుక ిముందుగా హృదయ పూర్వకశుభాకాంక్షలు తెలియచేస్తున్నాం. అదేవిధంగా నెల్లూరు జిల్లాలో విజయం సాధించిన నెల్లూరు నగర శాసన సభ్యులు పొంగూరు నారాయణ ని,సర్వేపల్లి శాసన సభ్యులుసోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని ఆత్మకూరు శాసన సభ్యులు పెద్దలు ఆనం రామనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలశారు. శుభాకాంక్షలు తెలియ చేశారు. ఏపీ యెన్‌జీజీఓస్ అసోసియేషన్ శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు,ఏ పీ యెన్‌జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, ఏపీయెన్‌జీజీఓస్ అసోసియేషన్ శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా కార్యదర్శి వెంకటస్వామి,అసోసియేట్ అధ్యక్షులు ఆంజనేయ వర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామకృష్ణా,జిల్లా కార్యవర్గ సభ్యులు కరుణమ్మ, మధు,శ్రీధర్,కృష్ణకుమార్,గిరిధర్, పెంచలయ్య,మహిళా జిల్లా చైర్ పర్సన్ చిన్నమ్మ,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వర్ణ లత,నెల్లూరు నగర అధ్యక్షులు రామకృష్ణ,కార్యవర్గసభ్యులు సురేష్,జనార్ధన్ రావు,చెంచయ్య,పొదలకూరు తాలుక అద్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు,చిరంజీవి,రాపూరు అధ్యక్షులు మల్లిఖార్జున,ఆత్మకూరు కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటూరి నాగేశ్వరరావుని కలసిన భాజపా శ్రేణులు.

విశాలాంధ్ర -కందుకూరు రూరల్ : కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ను కలసి పుష్పగుచ్చం, దుస్సాలువ తో సత్కరించి, శాసనసభ మొదటి సమావేశం లోనే కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో చేర్చాలనీ, నియోజకవర్గం లో మాదక ద్రవ్య వినియోగంతో పాటు బెట్టింగ్ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లోనియోజకవర్గ సమన్వయకర్త ఘట్టమనేని హరిబాబు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నాదుల రాఘవయ్య పట్టణ శాఖ అధ్యక్షులు మన్నేపల్లి వరప్రసాదరావు, ఉపాధ్యక్షులు అమలనాధుని మాల్యాద్రి నాయుడు, బొర్రా కోటేశ్వరరావు జిల్లా ఎస్సి, ఎస్టి మోర్చా ఉపాధ్యక్షులు జి మోజస్ జగన్నాథం వైకుంఠం ఓ బి సి మోర్చా పట్టణ అధ్యక్షులు మాటూరి రమేష్ నాయుడు కార్యదర్శి గొడ్డటి బాల రాఘవులు కోశాధికారి చిన్ని పాండురంగయ్య సోషల్ మీడియా ప్రతినిధి తుమ్మపూడి శివ మహేశ్వర రావు సీనియర్ నాయకులు ముప్పల భూషయ్య పాలూరు మాలకొండ రెడ్డి నవులూరు రాజేష్ డాల్దా సుబ్రహ్మణ్యం వేముల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటూరికి బ్రాహ్మణుల శుభాకాంక్షలు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ :కందుకూరు శాసనసభ్యులుగా ఘన విజయం సాధించిన ఇంటూరి నాగేశ్వరరావును కందుకూరు బ్రాహ్మణులు మర్యాదపూర్వకంగా కలిసి నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. వేద ఆశీర్వచనం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ దైవంతో సమానమైన బ్రాహ్మణులు తనని ఘనంగా సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందనిఅన్నారు. బ్రాహ్మణులకు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటాననిఅన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ రిటైర్డ్ డి.ఇ.ఇ మంచిరాజు మురళీమోహన్, ఆర్.వెంకటేశ్వర్లు(ఆర్వి) శ్రీరామగిరి శ్రీరామమూర్తి, చలంచర్ల సుబ్బారావు, రమణమూర్తి, ఏ. వి. రావు, వి.రాధాకృష్ణమాచార్యులు, నందనవనం రామసుబ్బారావు, విప్పగుంట నాగరాజారావు, పిన్నంరాజు ప్రభాకర్ రావు, నాగేశ్వరరావు, శేషగిరిరావు, సురేష్, నాగరాజు, గౌరీ శంకర్, సాయిరాం, తదితర బ్రాహ్మణులు పాల్గొన్నారు.

కాకర్ల సురేష్‌కు బి.వి.రామారావు అభినందనలు

కలిగిరి-విశాలాంధ్ర : తొలిసారి కూటమి ఎమ్మెల్యేగా బరిలో నిలబడి 9556 ఓట్ల మెజార్టీ సాధించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ను తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.వి.రామారావు గురువారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. వింజమూరు క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన సన్మాన కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గెలుపే ధ్యేయంగా టిడిపి, జనసేన, బిజెపి, నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో ఉదయగిరి రూపురేఖలు మారుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద కొండూరు గ్రామ కమిటీ అధ్యక్షులు వెల్లంకి కొండప నాయుడు, 258 బూత్ కన్వీనర్ మొక్క హజరత్రావ్, సురేంద్ర,పెద్ద కొండూరు గ్రామపంచాయతీ కి సంబంధించిన టిడిపి నాయకులు టిడిపి కార్యకర్తలుపాల్గొన్నారు.

ఆత్మకూరు ఎమ్మెల్యేను కలిసిన బొందిలి సంఘం

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బొందిలి సంఘం ప్రెసిడెంట్ నెల్లూరు కృష్ణ సింగ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అయిన రాజారాం శ్రీనివాస్ సింగ్ నెల్లూరు జిల్లా బొందిలి సంఘం ప్రెసిడెంట్, సెక్రటరీ అల్లూరు నాగేంద్ర సింగ్ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ ఎం తరుణ్ సింగ్ సంఘం సభ్యులు మాజీ మంత్రి ఆత్మకూరు శాసనసభకు ఎన్నికైన ఆనం రామ నారాయణ రెడ్డిని టీడీపీ ఆత్మకూరు ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించినారు.

సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసిన మనుబోలు జర్నలిస్టులు

విశాలాంధ్ర- మనుబోలు : నెల్లూరు వేదాయపాలెం లోని సోమిరెడ్డి నివాసంలో సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని గురువారం మనుబోలు విలేకరులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జూనియర్ సోమిరెడ్డి మాట్లాడుతూ అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని మీడియా సూచనలు సలహాలు తమకు అవసరమని పేర్కొన్నారు. నెలకు ఒకసారి మునుబోలు గ్రామానికి విచేసి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామని అన్నారు. తమ మావయ్య గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సుధాకర్ ,పాలెపు శంకర్, రవి ,గౌ స్ బాషా తదితరులు ఉన్నారు.

ఉద్యమ తార సుదర్శ పాలస్‌కు సీపీఐ నివాళి

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : తుది శ్వాస వరకు నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని, బలహీనవర్గాల హక్కుల సాధన, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించిన ఉద్యమ నేత పాలస్ అని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ ఆధ్వర్యంలో కందుకూరు ప్రాంతంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిస్టు ఉద్యమంలో నిరంతరం తన ఉద్యమాలతో అందరికీ కమ్యూనిస్టు యోధుడిగా ప్రసిద్ధిగాంచిన సుదర్శి పాలస్ 8వ వర్ధంతి కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ కార్యదర్శి సురేష్ బాబుతో పాటు సిపిఐ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులతో పాటు లాల్ సలాం లు అర్పించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ బలహీన వర్గాల్లో జన్మించి తన వర్గాల ప్రజలు తమ హక్కుల సాధన కోసం నిరంతరం అవమానాలు, దాడులు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను నేరుగా గుర్తించి విద్యార్థి ఉద్యమంలోనే నిరంతరం ప్రజల పక్షాన ఉద్యమించి ఐదు దశాబ్దాలకితమే ఎంఏ లిటరేచర్ విద్యను అభ్యసించి ఉన్నత ఉద్యోగం లభించినా వద్దని శ్రీకాకుళ ఉద్యమ ప్రారంభంలో ప్రారంభనేతగా ఉండి శ్రీకాకుళ ఉద్యమాన్ని ఉరక లెక్కించిన మహనీయుడు పాలస్ అని అన్నారు. అనంతరం కందుకూరు ప్రాంతంలో నిర్భవి పాఠశాలను ఏర్పాటు చేసి ఎంతోమంది పేద వర్గాల బిడ్డలకు ఉజ్వల భవిష్యత్తును అందించిన పేదల పక్షపాతి అని కొనియాడారు. తదుపరి కమ్యూనిస్టు ఉద్యమంతో మమేకమై నాంచారమ్మ కాలనీలో పేద వర్గాల నివేశన స్థలాల కోసం నిరంతరం పోరాటం చేసిన ఉద్యమ నేత పాలస్ అని అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి ఏర్పాటుకు ముందున్న నాయకుడు ఆయన అని అన్నారు. ఆస్తులు ఉన్నా లేకున్నా ఆరోగ్యం ఉన్నా లేకున్నా తుది శ్వాస వరకు కమ్యూనిస్టు ఉద్యమంలో నిబద్ధత కలిగిన నాయకునిగా కందుకూరు ప్రాంతంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఏ ప్రాంతంలో బలహీన వర్గాలకు అన్యాయం జరిగితే ముందుండి ఉద్యమం నడిపించిన ఉద్యమ తార పాలస్ అని అన్నారు. అలాంటి కమ్యూనిస్టు యోధుని ఉద్యమ స్ఫూర్తి నేటి తరం కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు ముఖ్యంగా యువ కమ్యూనిస్టులకు ఆదర్శం, స్ఫూర్తి అని అన్నారు. ఆయన స్ఫూర్తితో నిరంతర ఉద్యమాలతో బడుగు,బలహీన వర్గాలు, పేదలు, కార్మిక, కర్షక, రైతు కూలీ వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని కమ్యూనిస్టులు యువతరం నేతలు ప్రశ్నించాల్సిన ఆవశ్యకత ఎంతనేనా ఉందని ఆయన అందించిన పోరాట స్ఫూర్తి మన అందరికీ ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు మురళి, ఆనందమోహన్, రాము, బాల బ్రహ్మచారి, ఉప్పుటూరి మాధవరావు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా నారాయణ నివాసం

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : సార్వత్రిక ఎన్నికల్లోనెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా డాక్టర్ పొంగూరు నారాయణ భారీ విజయాన్ని సాధించారు. ఈసందర్భంగా నారాయణకి శుభాకాంక్షలు తెలిపేందుకు నెల్లూరులోని ఆయన నివాసానికి పెద్ద సంఖ్యలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భారీ మెజార్టీతో విజయం సాధించిన మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణను కలిసి అభినందనలు తెలియజేశారు. టీడీపీ ముఖ్యనేతలు, పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చి శాలువాలు, పూలమాలలు, భారీగజమాలలు, బొకేలు, జ్ఞాపికలు, స్వీట్స్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. తన విజయానికి కృషి చేసిన వారందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలియజేశారు. అభిమానుల తాకిడితో నారాయణ నివాసం జనసంద్రమైంది.

గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర- గుడ్లూరు : మండలంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం ఈ కార్యక్రమానికి 16 మంది విద్యా ర్థులు హాజరయ్యారు. ముందుగా విద్యార్థులచే పుస్తక పఠనం కథలు చదివించుట వ్రాయించి ఆటలు ఆడించారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంతి తెలుగు ఉపాధ్యాయులు సూరపురాజు ప్రసాద్ విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు టీవీ రమణ రాజు అలాగే మరొక ప్రధానోపాధ్యాయులు ఎం ప్రసాద్ హాజరై విద్యా ర్థులకు గ్రంథాలయ విశిష్టతను ఆవశ్యకతను గురించి తెలియజేశారు. అనంతరం ఈ శిక్షణా శిబిరానికి ఎంతో శ్రద్ధగా వచ్చి ఇక్కడ జరుగు అన్ని కార్యక్రమాల్లో శ్రద్ధగా పాల్గొన్న విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేశారు. అనంతరం డాన్స్, పాటలు పాడించారు. చివర్లో విద్యార్థులకు బిస్కె ట్లు మజ్జిగ వచ్చిన అతిథులుకు తేనేటి విందుతో సత్కరించి ధన్యవాదములు తెల్పుతూ వీడ్కోలు పలికారు.

నిల్వ ఉంచిన ఆహారం తింటే అనారోగ్యమే

విశాలాంధ్ర-ముత్తుకూరు : నిల్వ ఉంచిన ఆహారం తీసుకోవడం వలనే పైనాపురం దళితువాల్లో వాంతులు విరోచనాలకు గురయ్యారని అడిషనల్ డిఎం అండ్ ఖాదర్ వలీ తెలిపారు. గత నాలుగు రోజులుగా పైనాపురం దళిత వాడలో కొందరు వాంతులు విరోచనాలు తో నెల్లూరులోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో జిల్లా వైద్య అధికారులు ఆ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని పరిశీలించేందుకై ఖాదర్ వలీ గురువారం ఆ గ్రామానికి వచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గ్రామాన్ని అంతటా దాని పరిశీలించడం జరిగిందని ప్రతిచోట చెప్ప సోదరా లేకుండా క్లీన్ చేసి బ్లీచింగ్ కూడా వేయడం జరిగిందని ఆయన తెలిపారు. నిల్వఉంచిన ఆహారం ఎవరు తీసుకోవద్దని, ప్రధానంగా ఫ్రిడ్జ్‌లో రోజుల తరబడి కూరలు వంటివి కూడా ఉంచకూడదని ఆయన తెలిపారు. అలాగే కాచి వడపోసిన నీటిని మాత్రమే తీసుకోవాలని అలా తీసుకోవడం వల్ల ఎలాంటి వ్యాధులకు గురికారని తెలిపారు. తమ వైద్య శిబిరం ఈ గ్రామంలోని ఉంటుందని ఎవరికైనా ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తక్షణం ఈ వైద్య శిబిరానికి వచ్చి చూపించుకోవచ్చని ఆయన తెలిపారు.అవసరమైతే జిల్లా ప్రధాన ఆసుపత్రికి కూడా తరలిస్తారన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇప్పటికే హాస్పిటల్ చేరిన వారు డిశ్చార్జి అవుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు చందన ప్రియ, వైద్యులు ప్రమోద్, సర్పంచ్ కావలి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కోటంరెడ్డితో మాజీ మంత్రి నారాయణ భేటీ

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : మాజీ నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి నివాసానికి గురువారంవెళ్లికృతజ్ఞతలు తెలిపిన మాజీ మంత్రి నారాయణ. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉందామని నగరాన్ని తీర్చిదిద్దుదామని వెల్లడి. నగరనియోజకవర్గం అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమముపై అందరి సమిష్టి కృషితో నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీని తీసుకొచ్చామని మాజీ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ అన్నారు.. అనంతరం అరగంట పాటు నెల్లూరు నగర నియోజకవర్గం అభివృద్ధిపై చర్చించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నెల్లూరు నగర రూపురేఖలు మారుద్దామని పొంగూరు నారాయణ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ తమ వైపే ఉన్నారని ఫలితాలు స్పష్టం చేశాయని.. ఈ ఫలితాలు వల్ల దేశం మొత్తం మన వైపే చూసిందన్నారు. అందరం ఐక్యంగా ఉంటూ నెల్లూరుజిల్లాని అభివృద్ధి పథంలో నడిపిద్దాం అన్నారు. కార్యకర్తల సంక్షేమంనిధిపై కూడా వారుచర్చించారు. ఈ కార్యక్రమంలోనారాయణ విద్యా సంస్థల విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి గురువారం బీసిజీ వ్యాక్సినేషన్

విశాలాంధ్ర-రాపూరు : రాపూరు మండలంలోని వేపినాపి ప్రాథమిక ఆరో గ్య కేంద్రంలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినే షన్ గడిచిన నాలుగు వారాలుగా మండలంలో 1400 మందికి వ్యాక్సి నేషన్ చేయడం జరిగింది 60 సంవ త్సరాలు పైబడిన వారికి ,60 సంవ త్సరాలు కంటే తక్కువ ఉన్నవాళ్లు షుగర్ వ్యాధిఉన్నవాళ్లకి , ప్రస్తుతం లేదా ఇంతకుముందు ధూమపానం అలవాటు ఉన్నవాళ్లకి ,గత మూడు సంవత్సరాలుగా టీబీ వ్యాధి నుండి ట్రీట్మెంట్ తీసుకొని మందులు మింగి న వారికి, గత ఐదు సంవత్సరాలు క్రితం టీబీ మందులు మింగిన వారి కి ,బిఎంఐ 18 కన్నా తక్కువ ఉన్న వారికి, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ ఇవ్వ డం జరిగినది. ఇప్పటివరకు మండ లంలో కూడా ఎటువంటి ఇబ్బందు లు లేకుండా అందరూ వ్యాక్సిన్ చేయించుకోవడం జరిగినది ప్రతి గురువారం రోజు స్పెషల్ డ్రైవ్ కింద బీసీజీ వ్యాక్సినేషన్ చేశారు. ప్రతి సచివాలయం పరిధిలో ఆశా కార్యకర్త ,ఏఎన్ఎం, సిహెచ్ఓ ,సూపర్వైజర్, హెల్త్ అసిస్టెంట్, డాక్టర్. పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని సేనయపాలెం హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో డాక్టర్ సూర్య ధర్మేంద్ర పర్యవేక్షణలో అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ చేశారు. ప్రజలందరూ కూడా తప్పనిసరిగా ఈ వ్యాక్సినేషన్ వేయించుకోవాలన్నారు. చిన్న బిడ్డలకి బీసీజీ వ్యా క్సిన్ ఎలా వేస్తామో అదేవిధంగా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ ఇది అందరికీ వ్యాక్సినేషన్ చేయడం జరుగుతున్న ది, అందువల్ల తప్పనిసరిగా దీని అందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పి తెలియజేస్తున్నామని వేపినాపి వైద్య అధికారులు డాక్టర్ ప్రమీల రాజకుమారి, డాక్టర్ వివి సూర్య ధర్మేంద్ర తెలియజేసారు.